
# * ఇంటర్వ్యూ *

దుర్గారావుకి, జగదాంబకి చాల టెన్షన్‌గా ఉంది. పది రోజులనుండీ వాళ్ళు తెగ ప్రిపేర్ అవుతున్నారు. మర్నాడే ఇంటర్వ్యూ ఉంది. అంటే – ఒక్క రోజు మాత్రమే గడువు. ఈ ఒక్క రోజూ బాగా ప్రిపేర్ అవ్వాలి లేకపోతే ఇంటర్వ్యూలో ఫేలవుతారు. ఇంటర్వ్యూలో ఫేలవుతే ఇంకేమైనా ఉందా? ... అసలే దానిమీద చాలా ఆశలు పెట్టుకున్నాడు.




"ఆకలేస్తుంది... అన్నం పెట్టు" అన్నాడు దుర్గారావు జనరల్ నాలెడ్జి పుస్తకాన్ని మూసేస్తూ.

జగదాంబ రెండు ప్లేట్లలో అన్నం వడ్డించి "ఫాట్...ఫాట్" మని ప్లేట్లలో కంది పచ్చడి ముద్దలు కొట్టింది.

"కూర లేదా?" అని అడిగాడు దుర్గారావు.

జగదాంబ ఆ ప్రశ్న వింటూనే పళ్లు కర కరా నూరింది.

"అలా నూరకే... భయమేస్తుంది!... అయినా ఇప్పుడు నేనేమన్నానని అలా పళ్ళు నూరేస్తున్నావ్?" అన్నాడు తెల్లమొహం వేస్తూ.

"లేకపోతే కూర కావాలా? కూరేకాదు, సాంబారు, రసం ఏమీ చెయ్యలేదు. అవన్నీ చేస్తూ కూర్చుంటే ఇంటర్వ్యూకి ప్రిపేర్ అయినట్టే!..." అంది

కోపంగా. "ఆ పచ్చడి మెతుకులతోనే మింగండి."
"హహహ... మరి ఆ విషయం ముందే చెప్పొచ్చుగా... అలాగే అలాగలాగే..."
భోజనం అయాక మళ్ళీ ఇద్దరూ పుస్తకాలు తీశారు. సరిగ్గా అప్పుడే బాబిగాడు ఏడుపు లంకించుకున్నాడు.
"ఇంతసేపూ బాగానే ఉన్నావు... ఇప్పుడు సడెన్‌గా నీకేమొచ్చిందిరా?" విసుక్కుంది జగదాంబ.
"హమ్మా!... ఆచ్చి పోదామే!..." అన్నాడు వాడు ఏడుస్తూనే.
"ఆచ్చీలేదు గీచ్చీలేదు నోర్మూయ్!"
"వా..." వాడు వాల్యూం పెంచేసి ఏడవడం మొదలు పెట్టాడు.
"వెధవా!... మేం చదూకోవాలిరా... ఆచ్చి వెళ్దామంటే ఎలా?... అసలీ కష్టాలంతా నీవల్లే... " అంటూ వీపుమీద రెండు వడ్డించింది.
"వహ్వా...వా..." వాడింకా గట్టిగా ఏడవడం మొదలుపెట్టాడు.
"అబ్బబ్బ... చదువుకోనివ్వకుండా ఏంటీ గోల?... వాడి మొహాన కాస్త చిరుతిండి పడెయ్యరాదూ ఊర్కుంటాడు." విసుక్కుంటూ అన్నాడు దుర్గారావు.
జగదాంబ పళ్లు కరకరలాడిస్తూ భర్తవంక చూసింది.
"సర్లే...సర్లే... వాడి సంగతి నేనే చూస్తాలే" అని లేచి వంట గదిలోకి వెళ్లి డబ్బాలోంచి ఒక లడ్డూ తీసి బాబిగాడి మొహాన కొట్టాడు.
"హమ్మా చూడవే... నాన్న లడ్డూతో నా మొహం మీద కొట్టాడు....వా..." అన్నాడు బాబిగాడు మూర్ఛల రోగిలా కాళ్ళూ చేతులూ తన్నుకుంటూ.
జగదాంబ భర్త వంక చూసి పళ్లు కరకరలాడించింది.
దుర్గారావు కంగారు పడ్డాడు.
"ఆ...ఆ...ఊర్కో...ఊర్కో..." అని లడ్డూని ప్లేట్లో పెట్టి బాబిగాడి ముందుంచాడు.
బాబిగాడు ఏడుపు మాని లడ్డూ తినడం మొదలు పెట్టాడు.
ఆ రోజంతా వాళ్ళు చాల శ్రద్ధగా చదివారు. రాత్రంతా కూడా టీలూ గట్రా తాగుతూ జనరల్ నాలెడ్జి పుస్తకాలు, ఇంగ్లీషు గ్రామర్ అంతా చదివారు.
ఆ మర్నాడు ఇద్దరూ ఇంటర్వ్యూకోసం నీట్‌గా తయారయ్యారు. దుర్గారావు టక్ చేస్కుని టై కట్టుకున్నాడు. జగదాంబ కంచి పట్టుచీర కట్టుకుంది.
ఇద్దరూ ఆటో ఎక్కి "పిచ్చి పుల్లాయ్ హోలీ గ్రామర్ స్కూల్"కి వెళ్ళారు. అక్కడ వీళ్ళలాగా ఇంటర్వ్యూకి చాలా మంది వచ్చారు. అందరూ

ప్రిన్సిపాల్ మేరీ మార్గరెట్ గది ముందు బెంచీలమీద కూర్చుని తమ వంతు కోసం ఎదురు చూస్తున్నారు. ఫ్యూను ఒక్కొక్కళ్ళనే లోపలికి పంపిస్తున్నాడు. దుర్గారావు, జగదాంబల వంతు వచ్చేసరికి దాదాపు రెండు గంటలు పట్టింది.

"ప్లీజ్ టేక్ యువర్ సీట్!..." అంది ప్రిన్సిపాల్ మేరీ మార్గరెట్ గదిలోకి అడుగు పెట్టిన దుర్గారావు దంపతులతో.

ఇద్దరూ బిక్కుబిక్కుమంటూ ఆవిడ ఎదురుగా కూర్చున్నారు.

"ఏంటి మీ ఇద్దరి కళ్ళూ ఎర్రగా అలా ఉబ్బి ఉన్నాయ్?... రాత్రి... ఇద్దరూ ... అతిగా... హేమైనా?... ఆ?... " అంది కళ్ళు చిట్లించి అనుమానంగా ఇద్దరి వంకా చూస్తూ ప్రిన్సిపాల్.

వాళ్ళిద్దరూ సిగ్గుపడిపోయారు.

"ఛిఛీ... అట్టాందిదేమీ కాదండి... హి... ఈ రోజు ఇంటర్వ్యూ కదా... అందుకే రాత్రంతా మేలుకుని చదువుకున్నాం...హిహి!..." అన్నాడు దుర్గారావు.

"ఊ... అంతే కదా!... మా స్కూలంటే అల్లాటప్పా కింద, నేజ్జేసే ఇంటర్వ్యూ లెక్కలేని దాని కింద తీసేసి రాత్రంతా భయం భక్తి లేకుండా జల్సా చేస్కున్నారేమో అనుకున్నా..."

"అమ్మమ్మా... మీ స్కూలుకి మేమిచ్చే విలువ ఇంతా అంతా కాదు. అసలు వారం రోజులు కంటిమీద కునుకుంటే ఒట్టండీ!..." అంది జగదాంబ.

"వెర్రీ గుడ్... ఇప్పుడు నేను కొన్ని ప్రశ్నలు అడుగుతాను... మీరు ఠకీమని సమాధానం చెప్పాలి!... మీరెంత దాకా చదువుకున్నారు?..."

"ఠకీ..." ఇద్దరూ కోరస్‌గా అన్నారు.

"అదేంటి?" మేరీ మార్గరెట్ తెల్లబోయి చూసింది.

"మీరే కదండీ మరి, ఠకీ మని సమాధానం చెప్పాలన్నారు?" అమాయకంగా అన్నాడు దుర్గారావు.

మేరీ మార్గరెట్ మండిపడింది.

" ఠకీమని సమాధానం చెప్పమంటే వెంటనే సమాధానం చెప్పమని అంతేగాని ఠకీ అని అనమని కాదు..."

"అలాగే...హి! పొరపాటైపోయింది క్షమించండి హిహి!!..." అన్నాడు ఇబ్బందిగా నవ్వుతూ దుర్గారావు.

"ఊ...ఊ... చెప్పండి... మీరెంతదాకా చదువుకున్నారు?" కోరగా చూస్తూ

అడిగింది.
"ఇద్దరం పోస్టు గ్రాడ్యుయేట్లమే మేడం!" వినయంగా సమాధానం చెప్పాడు దుర్గారావు.
"ప్చ్... పోస్టు గ్రాడ్యుయేట్లే అన్నమాట!... పిహెచ్.డి. చేస్తే బాగుండేదే!!"
"మా బాబిగాడికి మీరు యల్కేజీలోనే కదండీ సీటిస్తారు?... వాడి హోం వర్కు చేయడానికి పోస్టు గ్రాడ్యుయేషన్ సరిపోతుంది కదండీ?... హి!" అన్నాడు దుర్గారావు.
"ఇప్పుడైతే యల్కేజీయే కాబట్టి, వాళ్లకి ఓన్లీ ఆల్ఫబెట్స్ ఉంటాయి కాబట్టి మీరీజిగానే హోం వర్కు చేయించేస్తారు... వచ్చే సంవత్సరం ఒకటో తరగతినుండి బోల్డన్ని సబ్జెక్టులు, బోల్డంత హోంవర్కు చెయ్యడం మీకు కష్టమైపోద్ది... "
"అబ్బే... మీరాయన మాటలు పట్టించుకోకండి మేడమ్... మేం ఇప్పట్నుంచే రీసెర్చి మొదలు పెడ్తాం. మా వాడు పై క్లాసులకు వచ్చేలోగా పిహెచ్.డి సంపాయిస్తాం..." ఆవిడకి సమాధానం చెప్పి భర్తని చూసి పళ్ళు కరకరలాడించింది జగదాంబ.
"సైలెన్స్! ఏంటా కంకర శబ్దం? ఇంటర్వ్యూ చేస్తున్నపుడు అలా చేగోడీలూ, జంతికలూ నమలొచ్చా?" కోపంగా జగదాంబ వంక చూస్తూ అంది మార్గరెట్.
"అబ్బే... అది జంతికలు తింటంలేదు మేడమ్! నా మీద కోపంతో పళ్ళు నూర్తుంది... అంతే... మీ తరువాతి ప్రశ్నలు అడగండి" అన్నాడు దుర్గారావు.
"తరవాతి ప్రశ్నలకోసం సంబరపడిపోతున్నారు గానీ... చకచకా జవాబులు చెప్పి మీరు ఇంటర్వ్యూలో సెలక్టయినంత మాత్రాన మీ అబ్బాయికి యల్కేజీలో సీటు రాదు...."
"మరి?"
"మీరు ఇంటర్వ్యూలో సెలక్టయిన తరువాత మీ అబ్బాయిని ఇంటర్వ్యూ చేస్తాం... మీ అబ్బాయి కూడా ఇంటర్వ్యూలో సెలక్ట్ అయితే అప్పుడు మీరు నాలుగు వేలు డొనేషన్ కడ్తే, హప్పుడు వాడికి యల్కేజీలో సీటిస్తాం..."
"అలాగే... అలాగలాగే... అంతా మీ దయ " అన్నాడు దుర్గారావు.
"ఊ... ఇప్పుడు కొన్ని జనరల్ నాలెడ్జి క్వశ్చన్లు అడుగుతా..."
ప్రిన్సిపాల్ అడిగిన ప్రశ్నలన్నింటికి ఇద్దరూ టక టకా సమాధానాలు

చెప్పారు.

"హర్ర్ర్ ్రే!... అసలు విషయం అడగడం మర్చిపోయా! మీ ఆస్తి వివరాలు చెప్పండి..." అంది మేరీ మార్గరెట్ గుండెలు బాదుకుంటూ. వాళ్ళిద్దరూ వాళ్ల ఆస్తి వివరాలు చెప్పారు.

"ఊ... అయితే మీకు పది లక్షలదాకా ఆస్తి ఉందన్నమాట!... కాస్త పరవాలేదులే..."

"ఆస్తి వివరాలు ఎందుకు మేడం?" సందేహంగా అడిగాడు దుర్గారావు.

"ఎందుకేంటి? ఇప్పుడు డొనేషన్ తీస్కోడమే కాదు... ప్రతి సంవత్సరం బిల్డింగ్ ఫండనీ, ఆ ఫండనీ ఈ ఫండనీ డబ్బులు వసూలు చేస్తూనే ఉంటాం. వాటన్నిటికీ తట్టుకొనే వాళ్ళ పిల్లలకే సీటిస్తాం... సరేగానీ మీ ఇంట్లో పనివాళ్ళు ఎందరున్నారు?"

"అబ్బే! ... పనివాళ్ళెందుకండీ... మా పని మేమే చేస్కుంటాం." ఇద్దరూ అన్నారు.

"మరి వంట మనిషో?"

"లేదండీ... ముగ్గురికి నేనే వంట చేసేస్తా!" అంది జగదాంబ.

"అయితే మీ అబ్బాయికి మా స్కూల్లో సీటు లేదు... మీరు ఇంటర్వ్యూలో ఫేలయ్యారు... హోహోహో..." గర్వంగా నవ్వింది మేరీ మార్గరెట్.

"అదేంటండీ?... ఎందుకలా?" అయోమయంగా అడిగారు వాళ్ళిద్దరూ.

"పని వాళ్ళు లేక యింటి పన్లు ఈయన చేస్తాడు. వంటపనేమో మీరు చేస్తారు. ఇంక పిల్లాడి హోంవర్కు చేసే తీరికా వాడిని చదివించే తీరికా మీకెక్కడుంటుంది? మా స్కూల్లో మేమెలాగూ చదివించం. .. మీరైనా యింటిదగ్గర చదివించకపోతే ఎట్టా? అందుకే మీకు యల్కేజీ సీటు లేదు..."

"ఆ!..." అంటూ నోళ్ళు తెరుచుకుని, మిడి గుడ్లేస్కుని మార్గరెట్ వంక చూశారు దుర్గారావూ, జగదాంబా.

* * *